# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 09-06-2016**

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన జిల్లాల పునర్విభజన ప్రక్రియను కేవలం జిల్లాల విభజనే కాదని మండలాల పునర్విభజనగా కూడా పరిగణించాల్సి వుంటుందని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు జిల్లా కలెక్టర్లకు సూచించారు. పరిపాలనా సౌలభ్యం ప్రజల సౌకర్యం ప్రధాన లక్ష్యంగా చేపట్టిన జిల్లాల, మండలాల పునర్విభజన క్రమంలో కొనసాగుతున్న కసరత్తు, పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నడుస్తున్న రెండవరోజు జిల్లా కలెక్టర్ల సమీక్షా సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి గత కలెక్టర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన కార్యాచరణ ఎంత వరకు వచ్చిందో ఆరా తీశారు.

పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ… "దైవ కృప వల్ల అనుకున్న దానికంటే ఎక్కువగానే తెలంగాణలో అభివృద్ధి సూచి కనిపిస్తున్నది. కాలం ఇదే విధంగా ప్రజలకు అనుకూలంగా కలిసివస్తే ఆర్థికవేత్తల అంచనాల ప్రకారం 2019-20 వరకు బడ్జెట్ అంచనా రెండు లక్షల కోట్లకు చేరుకుంటది. ఐదేండ్లకు సహజంగా రెట్టింపు అయితది. అంటే నాలుగు లక్షల కోట్లకు చేరుకుంటది. అయితే అంచనాలకు మించి మరో లక్ష కోట్లు జమయి 2024 వరకు ఐదు లక్షల కోట్లకు తెలంగాణ బడ్జెట్ అంచనా వ్యయం చేరుకుంటది" అని వివరించారు.

తెలంగాణ అభివృద్ధి చక్రవడ్డీ మాదిరి రెట్టింపు అవుతూ అభివృద్ధి వేగం ఆక్సిలరేట్ అవుతుందని సిఎం ఆశాభావం వ్యక్తం చేశారు. పెరిగే అభివృద్ధి క్రమాన్ని దృష్టిలో వుంచుకుని పాలనా ఫలాలు ప్రజలకు క్షేత్ర

స్థాయిలోకి చేరుకునేలా ప్రణాళికలు రచించడమే ప్రజా ప్రభుత్వం మీదున్న బాధ్యతగా సిఎం అభివర్ణించారు. పరిపాలన ప్రజలకు మరింత చేరువలో వచ్చినప్పుడే అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందుతాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన జిల్లాలు, మండలాల పునర్విభజన అందులో భాగమేనని సిఎం పునరుద్ఘాటించారు.

ప్రస్తుతం తాగునీరు, సాగునీరు పునరుద్ధరణే లక్ష్యంగా కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొద్ది కాలంలోనే పూర్తవుతాయని పేర్కొన్న సిఎం తదనంతరం చేపట్టాల్సిన కార్యక్రమాలకు ఇప్పటినుంచే రూపకల్పన చేయాలన్నారు. "2024 కల్లా ఐదు లక్షల కోట్లతో ఎంతో రిచ్ గా ఉంటాం. మరి ఆ రిసోర్సులన్ని ఎటుపోవాలె? తాగునీరు, సాగునీరు మీద యుద్ధం అయిపోతే తర్వాత పేదరికం కేంద్రంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలతో ఇబీసీల్లో ఉన్న ఒక్కొక్క పేద కుటుంబాన్ని టార్గెట్ చేసి అభివృద్ధి చేస్తం" అని సిఎం తెలిపారు.

కొత్తగా ఏర్పాటు చేయవలసిన మండలాల గురించి కలెక్టర్లు చేసిన ఇప్పటిదాక చేసిన కసరత్తును ఒక్కో జిల్లా కలెక్టర్ నుంచి ఆరా తీశారు. ఆయా మండలాల్లో నివసిస్తున్న ప్రజల ఆకాంక్షలు ఏ విధంగా వున్నాయి. వారితో మాట్లాడిండ్రా? స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో చర్చించిండ్రా? అని సిఎం కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

మండల కేంద్రానికి దూరంగా వున్న గ్రామాలను గుర్తించి దగ్గరలో వున్న మండల కేంద్రానికి కలిపే సందర్భంలో ప్రజాభిప్రాయం ముఖ్యమన్నారు. "దేరీస్ నో తంబ్ రూల్ ఓన్లీ లిబరల్" (ఇట్లనే ఉండాలని కాదు ప్రజల సౌకర్యం దృష్టిలో వుంచుకుని నిర్ణయాలుండాలే) అని విస్పష్టం చేశారు. ప్రస్తుత జిల్లా నుంచి పక్క జిల్లాకు పోయే మండలాలు ఏమైనా ఉన్నాయా? ఒక్క నియోజక వర్గం ఒకటికి మించి జిల్లాలో విస్తరించి ఉందా? ఉంటే ఎట్లా ఉన్నది? అక్కడి భౌగోళిక పరిస్థితులు ఏమిటి? అన్ని సమీక్షించాలన్నారు. ఇవన్నీ సమీక్షించిన తరువాత పూర్తి స్థాయి మండలాల సంఖ్య అంచనా వేయడానికి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కలెక్టర్లకు సూచించారు.

"మీరు మీ కసరత్తు పూర్తి చేయండి. మొత్తం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో కూర్చుని చర్చించండి. ఓ ఐడియాకు రండ్రి. ఆ తర్వాత అభ్యంతరాల కోసం ప్రజా ప్రకటన ఇద్దాం. ఆతర్వాత చివరిగా నోటిఫికేషన్ జారీ అయితది." అని అన్నారు.

సిసిఎల్ఏ రేమాండ్ పీటర్ అందించిన వివరాలతో ప్రారంభమైన సమావేశంలో మంగళవారం జరిగిన కసరత్తుపై సిఎం సమీక్షించారు. ఎన్ని కొత్త మండలాలుండాలె? ఎన్ని రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాలుండాలె? ఎన్ని కొత్త జిల్లాలుంటే ప్రజలకు సౌకర్యం అనే అంశాలు మంగళవారం నాటి సమావేశంలో చర్చించినట్లు రేమండ్ పీటర్ ముందుగా వివరించారు.

సుమారు 50 వేల నుంచి 60 వేల జనాభా వుండే ఒక మండలం ఏర్పాటు, సుమారు 20 మండలాలతో జిల్లా ఏర్పాటు, సుమారు లక్షన్నర జనాభాతో అర్బన్ మండలాల ఏర్పాటు, ఒక రెవిన్యూ డివిజన్ పరిధిలో 10 నుంచి 12 మండలాలు, రెండు అసెంబ్లి సెగ్మెంట్లు, ఒక అసెంబ్లి సెగ్మెంటుకు 5 నుంచి 6 మండలాలు వుండే విధంగా కసరత్తు చేయాలన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కలెక్టర్లకు పలు సూచనలు చేశారు:

ప్రస్తుతమున్న నియాజకవర్గాన్ని దృష్టిలో ఉంచుకొని కసరత్తు చేయడం అవసరంలేదన్నారు.
బలవంతంగా తమను ఇతర మండలంలో కలిపారన్న భావన ప్రజలకు రాకుండా చూడాలని అన్నారు.
ప్రజాక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నం కనుక ఆయా గ్రామాలను వివిధ మండలాలలో కలుపుతున్న, తీసివేస్తున్న సందర్భాల్లో ప్రజల అభిప్రాయాలు తీసుకుంటే బాగుంటుందన్నారు.
పెద్ద మండలాలను రెండుగా చేసే అంశాలను పరిశీలించండి
ప్రజల అవసరాలు సెంటిమెంట్లను సమన్వయం చేసుకుంటూ శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకోవాలె.
వ్యక్తుల అభిప్రాయాలు, రాజకీయ కోణంలో కాకుండా ప్రజాక్షేమమే ధ్యేయంగా నిర్ణయాలుండాలని అన్నారు.

మారుతున్న కాలంతో మారుతూ అభివృద్ధిని అందుకోవాలని లేకుంటే తెలంగాణ ప్రగతి సాధ్యం కాదని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చిన్నచిన్న దేశాలు, వాటిలో జిల్లాలను పరిపాలన కేంద్రాలను ఉదహరించారు.

తెలంగాణలో మరికొద్ది సంవత్సరాల్లో ఊహించినంత అభివృద్ధి జరుగబోతుందన్న ఆశాభావం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి "హైదరాబాద్ ట్రాఫిక్ ను భవిష్యత్ లో హెలికాప్టర్ల ద్వారా పర్యవేక్షించే పరిస్థితులు వస్తాయి. మీరిట్లనే ఉండిపోతరని ఎందుకు అనుకుంటరు" అని అన్నారు.

కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి చర్చించిన మరిన్ని అంశాలు
సమావేశంలో పది జిల్లాల నుంచి, వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న అనేక డిమాండ్లపై చర్చ జరిగింది. సాధ్యా సాధ్యాలను పరిశీలించి వాటిపై నిర్ణయాలు తీసుకోవాలని సిఎం సూచించారు.

అటవి ప్రాంతంలో ఉండే మండలాల విషయంలో భౌగోళిక విస్తీర్ణతనూ పరిగణలోకి తీసుకోవాలని, హార్డ్ అండ్ ఫాస్ట్ – థంబ్ రూల్ పద్దతిలో కాకుండా పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఆలోచించి జిల్లాల, మండలాల పునర్విభజన నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్లకు సిఎం సూచన చేశారు.

కలెక్టరేట్లు, కలెక్టర్ల వ్యవస్థను సమాంతరంగా బలోపేతం చేసే దిశగా ఆలోచనలకు పదును పెట్టాలని తెలిపారు.

నూతనంగా ఏర్పాటుకానున్న జిల్లా కేంద్రాలు తెలంగాణలో అభివృద్ధి కేంద్రాలుగా మారాలన్నారు.

మండలాల వ్యవస్థను అభివృద్ధికి అనుకూలంగా తీర్చిదిద్దుకోవాలె, మండల కేంద్రంగా జరుగబోయే అభివృద్ధిలో కేవలం సాంకేతికతే కాదు మానవీయ కోణం వుండాలన్నారు.

తెలంగాణను క్షేత్ర స్థాయిలోకి అభివృద్ధి చేసుకోవాలంటే కఠిన వైఖరితో కార్యచరణ చేపట్టాలె, కింది స్థాయిలో ఉద్యోగులతో పద్దతి ప్రకారం పనిచేయించుకోవాలె, అవినీతిని తీవ్రంగా పరిగణించి నిర్మూలించాలన్నారు.

సాదాబైనామాల క్రమబద్దీకరణ, రిజిస్ట్రేషన్ల అంశంలో కూడా సమావేశంలో చర్చించారు. గతంలో జరిగిన సమీక్షను దృష్టిలో ఉంచుకొని, ఎటువంటి వొత్తిడిలకు లోను కాకుండా పురోగతి సాధించాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

నూతన జిల్లాల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా చేపట్టనున్న కార్యచరణ ప్రణాళిక – తేదిలు, వివరాలు:

జూన్ 20 తేదిలోపు అన్ని జిల్లాల కలెక్టర్లు సమగ్ర నివేదికను సిసిఎల్ఏ రేమండ్ పీటర్ కు అందజేయాలె. దాన్ని సిసిఎల్ఏ మరియు సిఎస్ ఫైనలైజ్ చేయాలె.
జూన్ 30 లోపు... స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులతో జరపాల్సిన అభిప్రాయ సేకరణ, చర్చ, తదితర రాజకీయ ప్రక్రియ పూర్తిచేయాలె.
జూలై 5న ... తిరిగి కలెక్టర్లతో సమీక్షా సమావేశ నిర్వహణ.
జూలై 10 లేదా 11 తేదిల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం.
ఆగస్టు 4 నుంచి 10 తేదిలోపు డ్రాఫ్టు నోటిఫికేషన్ తయారీ - జారీ.
ప్రకటన జారి అయిన తేది నుంచి నియమిత గడువు (నెలరోజులు) లోపు వచ్చే అభ్యంతరాలను ఆయా జిల్లా కలెక్టర్లు క్రోడీకరించి రెవెన్యూ శాఖ కార్యదర్శి మరియు సిసిఎల్ఏ కు అందజేయాలె.
జిల్లా ఏర్పాటుకు సంబంధించిన సంపూర్ణ ప్రక్రియను పూర్తి చేసుకుని అక్టోబర్ 11, (విజయదశమి) నాటికి నూతన జిల్లాల ఆవిర్భావం.
కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు సూచించిన మరికొన్ని అంశాలు

జిల్లాల, మండలాల పునర్విభజన తదితర అంశాలపై జూన్ 7, 8 తేదీలలో రెండురోజులుగా జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని, సూచనలను నిర్ణయాల ఆధారంగా ఈ నెల 20

తేదిలోపు ప్రతి కలెక్టర్ సమగ్ర నివేదికను తయారు చేయాలె, దానిని భూ పరిపాలన కమిషనర్ రేమాండ్ పీటర్ కు అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

జిల్లా కార్య నిర్వహణ యంత్రాంగం తీరు తెన్నులను పరిశీలించాలే, జాయింట్ కలెక్టర్లు, డిఆర్ఓలు, పిడీలు, పిఓలు, ఈడి, డిడి తదితర ఉన్నత అధికారులు వారి కింద పనిచేస్తున్న ఇతర అధికారులు, ఉద్యోగుల వివరాలను లెక్కలు తేల్చాలే.

నూతనంగా ఏర్పాటయిన జిల్లాల్లో అనుభవం ఉన్న వారిసే కేటాయించాలె, యింకా ఏమైనా తక్కువయితే పాత జిల్లాల్లో వీలయినంత వరకు సర్దుబాటు చేసుకోవాలన్నారు.

తెలంగాణ భిన్నమైన భౌగోళికాంశాల సమాహారంగా ఉన్నందున ఆయా జిల్లాలకు సంబంధించి ప్రత్యేక పరిస్థితులు, ప్రాధాన్యతలను నిర్దేశించుకుని తగిన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.

ఉదాహరణకు ఆదిలాబాద్ ను తీసుకున్న ముఖ్యమంత్రి… “అంటురోగాలతో ఆదిలాబాద్ జిల్లాలో మరణాలు” అనే మాట యికనుంచి వినపడకూడదని అన్నారు. అక్కడి గిరిజనులకు వారి ఆరోగ్యంపై అవగాహన పెంచాలె. వారికొచ్చే రోగాలకు పౌష్టికాహారలోపం కారణమనే విషయాన్ని ఎరుకపరచాలె. అందుకు సాంస్కృతిక సారథులతో, స్థానిక గోండు భాషలో సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించి 40 నుంచి 50 బృందాల వారిగా ప్రదర్శనలు చేపట్టి చైతన్య పరచాలన్నారు.

వాతావరణంలో మార్పులు, వర్షాకాలం రావడంతో అంటువ్యాధులు, తదితర సీజనల్ డిసీసెస్ వ్యాప్తి అనే అంశం మీద సిఎం కేసిఆర్ కలెక్టర్ల తో చర్చించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలను డేంగ్యూ, స్వైన్ ఫ్లూ తదితర ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలె. మెడిసిన్ ను అందుబాటులో వుంచాలన్నారు.

ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో కలెక్టర్లు నిరంతరం సమన్వయంతో చేసుకోవాలె. వ్యాధుల నియంత్రణలో అప్రమత్తతో వుండాలన్నారు.

జిల్లా కేంద్రాలు, ఏరియా దవాఖానాలు, మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులను మెరుగుపరిచేందుకు కేటాయించిన నిధులను సత్వర పారదర్శకతతో ఖర్చు చేయాలన్నారు.

వస్తువుల పంపిణీ, సానిటేషన్ తదితర అంశాల్లో ఖాయం చేసిన కాంట్రాక్టర్లపై పర్యవేక్షణ, నిర్ణయాధికారం ఆయా జిల్లాల కలెక్టర్లదేనన్నారు.

దసరా రోజున నూతన జిల్లాలు అమలులోకి వస్తున్నందున అందుకు సంబంధించిన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, రెవిన్యూ తదితర ప్రభుత్వ విభాగాలు, వ్యవస్థల ఏర్పాటు అందుకు సంబంధించిన రిపోర్టును అన్ని విభాగాల నుంచి ఈ నెల 20 లోపు రాబట్టుకోవాలె, ఫర్నీచర్, వాహనాలు, బిల్డింగులు తదితర అంశాలకు సంబంధించి ఆయా విభాగాల అధికారులతో నేరుగా మాట్లాడి వివరాలు, లోటుపాట్లు అడిగి తెలుసుకోవాలని కలెక్టర్లకు సూచించిన సిఎం రానున్న 20వ తారీఖు సమావేశంలో నివేదించాలని అన్నారు. దసరా నుంచి కొత్త జిల్లాలు అమల్లోకి వస్తున్న నేపథ్యంలో అదే రోజున కలెక్టర్ సహా సంబంధిత జిల్లా యంత్రాంగం మొత్తం బాధ్యతలు స్వీకరించాలె. ఈ లోపు ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి కావాలన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటి సిఎంలు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, పోచారం శ్రీనివాస రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, చీఫ్ సెక్రటరి రాజీవ్ శర్మ, ప్రిన్సిపల్ సెక్రటరి నర్సింగ్ రావు, సిసిఎల్ఎ రేమండ్ పీటర్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి

మీనా, సిఎంవో అధికారులు భూపాల్ రెడ్డి, స్మితా సబర్వాల్, ప్రియాంకవర్గీస్, పది జిల్లాల కలెక్టర్లు, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**